క్లుప్తంగా

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల ఆహ్వాన పత్రికను సోమవారం పిఠాపురంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆవిష్కరించారు. వచ్చే నెల 3 నుంచి 7వ తేదీ వరకూ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గొల్లప్రోలు జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు మొగలి బాబ్జి, మొగలి అయ్యారావు, సాంబశివరావు, ఆనాల సుదర్శన్, కారే శ్రీనివాసరావు, గండేపల్లి బాబీ తదితరులు పాల్గొన్నారు.

మినీ ఆర్వో ప్లాంట్ ప్రారంభం


మినీ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ట్రస్టు బోర్డు చైర్మన్ ప్రభాకరరావు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలోని ఏపీ టూరిజం వసతి సముదాయంలో భక్తుల సౌకర్యార్థం మినీ ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు తెలిపారు. గొల్లపల్లి వెంకట బాల సుబ్రహ్మణ్యం దంపతుల ఆర్థిక సహకారంతో ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కాగా సోమవారం ప్రత్యేక పూజలు చేసి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది పనితీరు మెరుగుకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. సోమవారం పనసపాడు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మండలంలోని హెచ్‌ఎంలకు ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జవాబుదారీతనం పెంచేందుకు పాఠశాలల్లో సామాజిక తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. సామాజిక తనిఖీలతో పాఠశాలల్లోని లోటుపాట్లు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిద్వారా పాఠశాలల అభివృద్ధికి బాటలు పడతాయని చెప్పారు. ఈ తనిఖీలను విద్యా కమిటీ సమక్షంలో పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణకు 75 మంది హెచ్‌ఎంలు హాజరు కాగా పి.శేఖర్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

సామర్లకోట: స్థానిక పోలీస్ రింగ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కౌన్సిలర్ నేతల హరిబాబు సోమవారం కమిషనర్ సీఎంపీ నయాం అహ్మద్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై కౌన్సిల్ సమావేశంలో చర్చించి సభ్యుల అభిప్రాయం తీసుకోవడానికి అజెండాలోకి ఈ అంశాన్ని తీసుకురావాలన్నారు.

ఆక్రమణలపై చర్యలకు వినతి

కొత్తపల్లి: అంగన్‌వాడీ భవనానికి సంబంధించిన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని పొన్నాడ ఎండీ పేటకు చెందిన ఏడిద వరహాలు, వడ్డీ పాండవులు, రాయి రవికుమార్, ఏడిద నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలంలో అంగన్‌వాడీ భవనం నిర్మిస్తుంటే ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారన్నారు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు, ఎంపీడీఓ అబ్రహం లింకన్, తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రాలు సమర్పించినట్టు తెలిపారు.

పంచారామ క్షేత్రంలో రద్దీ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారి తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి బారులు తీరారు. తొలి అభిషేకం అనంతరం పిఠాపురం మహారాజా గోత్రనామాలతో పూజలు ప్రారంభించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజలు చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, సభ్యులు, ఆలయ సిబ్బంది భక్తులకు సేవలందించారు.

ఆవకాయ్.. రుచి చూడవోయ్

- గ్రామాల్లో జోరుగా పచ్చళ్ల తయారీ
- మామిడి కాయల కోసం క్యూ కడుతున్న జనం
- పెరిగిన పచ్చడి సామగ్రి ధరలు

పిఠాపురం: ఆంధ్రులంటే ఆవకాయ గుర్తుకొస్తుంది. తెలుగు వారు అగ్రతాంబూళం ఇచ్చే పచ్చడి ఏదంటే ఆవకాయనే ముక్తకంఠంతో చెబుతారు. ఆవకాయ ఆంధ్రాలో పుట్టి దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి పొందింది. కొత్త ఆవకాయ పేరు వింటేనే నోరూరిపోతుంది. వేసవిలో వేడి సెగలు కుక్కుతున్నా.. వడగాడ్పులు వీస్తున్నా.. ఆంధ్రాలో ప్రతి ఇంటా ఆవకాయ పచ్చడి తయారీ మాత్రం ఆగదు. రుచికి తగ్గట్టుగానే దీని తయారీ సైతం ఒక పెద్ద ప్రహసనమే అని చెప్పాలి. ప్రస్తుతం మామిడి కాయల సీజన్ రావడంతో పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని ప్రతి ఇంటా మహిళలు పచ్చడి పెట్టె పనిలో బిజీగా ఉన్నారు.

48 వేల హెక్టార్లలో సాగు

గ్రామాల్లో పచ్చడి తయారీలు ఊపందుకున్నాయి. పచ్చళ్లకు ఉపయోగించే చెరకు రసం, కొత్తపల్లి కొబ్బరి, కలెక్టర్, మామిడి కాయలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడం వల్ల మంచి గిరాకీ ఏర్పడింది. ఆరోగ్య ప్రదాయినిగా చెప్పుకునే మామిడిని తినని వారుండరు. ముఖ్యంగా పీచు అధికంగా గల బంగినపల్లి, రసాలు, కొత్తపల్లి కొబ్బరి మామిడి పండ్లకు ఎక్కువ గిరాకీ ఉంటుంది. కలెక్టర్, కొబ్బరి మామిడి వంటి పచ్చి మామిడి కాయలను ఊరగాయలకు ఎక్కువగా ఉపయోగిస్తారు అందువల్ల మామిడి సీజన్ ప్రారంభంలోనే వీటికి గిరాకీ పెరుగుతుంది. ఊరగాయలకు ఉపయోగించే కేజీ పచ్చి మామిడి కాయలకు రూ.35 నుంచి రూ.45 వరకు ధర పలుకుతుంది. ముఖ్యంగా జిల్లాలోని ఏజెన్సీ, మెట్ట ప్రాంతాలతో పాటు పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలో సుమారు 48 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగవుతున్నాయి. ప్రస్తుతం చిన్న సైజులో ఉన్న మామిడి కాయలను కూరల్లో వినియోగించడానికి కోసి అమ్మకాలు సాగిస్తున్నారు. టెంకలు ముదిరిన కాయలను పచ్చళ్లకు అమ్ముతున్నారు. కాకినాడ జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. నిత్యం జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 120 టన్నులకు పైగా మామిడి కాయలు అమ్మకాలు కొనుగోలు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.


సిద్ధమైన ఆవకాయ


పచ్చళ్ల కోసం సిద్ధం చేసిన పచ్చి మామిడి కాయ ముక్కలు

ఊరించనున్న పచ్చళ్లు

పచ్చి మామిడి కాయలతో తయారు చేసే ఊరగాయలు, ఆవకాయ, మాగాయ వంటి పచ్చళ్ల తయారీలు ఊపందుకున్నాయి. ఎక్కడ చూసినా పచ్చడి మామిడి కాయలు అమ్మకాలు జోరుగా సాగుతుండగా ఇళ్ల వద్ద పచ్చళ్ల తయారీకి ఏర్పాట్లు చేస్తున్నారు. తయారీలో జాగ్రత్తలు పాటించకపోతే ఎక్కువ కాలం నిల్వ ఉండదు. కొత్తగా వచ్చిన పచ్చి మామిడి కాయలను మాత్రమే వాడతారు.


పిఠాపురంలో ఆవకాయ పచ్చడికి మామిడి ముక్కలు కోస్తున్న మహిళలు

ఆవకాయ పచ్చళ్లలో రకాలు

తీపి ఆవకాయ ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేకం. ఆంధ్రా ఆవకాయ గోదావరి జిల్లాలకు ప్రత్యేకం. ఆవ పిండితో పెట్టే ఆవకాయతో పాటు అల్లం ఆవకాయ, బెల్లం ఆవకాయ, మాగాయ, కాయ ఆవకాయ, పులిహోర ఆవకాయ, పెసర ఆవకాయ, నువ్వు పొడి ఆవకాయ, మెంతి ఆవకాయ, తురుము మాగాయ, నీళ్ల ఆవకాయ, కొబ్బరి ఆవకాయ, తొక్కు మాగాయ, శనగల ఆవకాయ, వెల్లుల్లి ఆవకాయ, ఉడుకు మాగాయ, పిండె మాగాయ, ఎండు ఆవకాయ వంటి ఎన్నో రకాల పచ్చళ్లను పెడుతారు.

మిరపకాయలకూ గిరాకీ

మామూలుగా వ్యాపారులు దుకాణాల్లో అమ్మే కారంతో పచ్చళ్ల తయారు చేస్తుంటారు. కాని గృహాల వద్ద సొంతంగా తయారు చేసుకునే వారు మాత్రం పచ్చడికి వాడే కారంలో అత్యంత జాగ్రత్తలు పాటిస్తుంటారు. నాణ్యమైన మిరప కాయలనే కొని బాగా ఎండబెట్టి ఇళ్ల వద్దే ఆడించి పచ్చడికి వాడుతుంటారు. మిరప పంటకు పెట్టింది పేరైన గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో మిరప కాయల అమ్మకాలు ఊపందుకున్నాయి.

30 ఏళ్లుగా ముక్కలు కొడుతున్నా..



గత 30 ఏళ్లుగా పచ్చడి మామిడి ముక్కలు కొడుతున్నా. ఏటా ఏప్రిల్ నెలలో ప్రతి రోజూ 500 కాయల వరకు ముక్కలు కొట్టి ఇస్తుంటాను. మామూలు కత్తులతో కోస్తే పీచు లేచి పచ్చడి తొందరగా పాడైపోతుంది. మేమైతే మేదర కత్తులతో పీచు లేవకుండా ముక్కలు కొట్టడం వల్ల పచ్చడి ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. అందుకే మా దగ్గరకు మామిడి కాయలు తెచ్చి ముక్కలు కొట్టించుకుంటారు.

సత్తమ్మ, పిఠాపురం

లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- మంగితుర్తిలో గడపగడపకూ మన ప్రభుత్వం

పిఠాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మండలం మంగితుర్తిలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పెన్షన్ తీసుకోవాలంటే ఎంతో టెన్షన్ పడాల్సి వచ్చేదన్నారు. అవ్వాతాతలు ఎక్కడో ఉన్న పంచాయతీ కార్యాలయానికి కాళ్లరిగేలా తిరిగేవారని, ప్రస్తుతం లబ్ధిదారుల ఇంటికే వలంటీర్లు తెచ్చి పెన్షన్ ఇస్తున్నారన్నారు. కచ్చితంగా ఒకటో తేదీన ఇంటికి తెచ్చి పెన్షన్ ఇచ్చే విధానం దేశంలో మన రాష్ట్రంలోనే అమలవుతుందన్నారు. పథకాల పంపిణీలో ఎటువంటి అవకతవకలకు తావు లేదన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పని చేస్తోందని, అన్ని పథకాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. దీనిని తట్టుకోలేక ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. తమ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం వర్తించిందని, ఒక్కో ఇంట్లో నాలుగు నుంచి ఆరు పథకాల వరకు అందుకుంటున్న లబ్ధిదారులు ఉన్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కసిరెడ్డి శివజ్యోతి, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, పలువురు అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు


మంగితుర్తిలో ఎమ్మెల్యే పెండెం దొరబాబును ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

మంగితుర్తి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఎస్.సింహాచలం, వళ్ల గోవిందరాజులు, వళ్ల తలుపులమ్మ, వళ్ల దుర్గారావు, అపర్ణ, వళ్ల వెంకటరమణ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ శ్రేణులు సోమవారం వైఎస్సార్ సీపీ లో చేరారు. వారికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు పార్టీ కడంవాలు వేసి ఆహ్వానించారు.

ప్రజల నమ్మకం జగనన్నే..

- ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు
- నియోజకవర్గంలో 82 వేల ఇళ్లు పూర్తి
- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

సామర్లకోట: ఏ గడపకు వెళ్లినా మా నమ్మకం జగనన్నే అంటూ జనం చెబుతున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పండగ వాతావరణంలో జరుగుతుందన్నారు. సోమవారం స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఇప్పటి వరకూ కోటి కుటుంబాలను కలుసుకున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ సీఎం జగన్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని తెలిపారు. పెద్దాపురం నియోజకవర్గంలో 94 వేల ఇళ్లు ఉండగా ఇప్పటి వరకూ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు 82 వేల ఇళ్ల యజమానులను కలుసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై ప్రతి కుటుంబం సంతృప్తి వ్యక్తం చేస్తుందన్నారు. మిగిలిన కుటుంబాలను మూడు రోజుల్లో కలుసుకుంటామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పెద్దాపురం నియోజకవర్గంలో భారీ మెజార్టీతో వైఎస్సార్ సీపీ గెలుస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. పథకాల అమలులో పార్టీలు, కుల, మతాలు చూడకుండా అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో అభివృద్ధి పనులు ప్రారంభించి మధ్యలో వదిలేసిన ఘనత అప్పటి డిప్యూటీ సీఎం చినరాజప్పకే దక్కుతుందన్నారు. కాపు కల్యాణ మండపం, పంచారామ క్షేత్రం వద్ద విశ్రాంతి భవనం, స్టేషన్ సెంటర్‌లో గడియార స్తంభం, గోదావరి కాలువపై వంతెన పనులు అసంపూర్తిగా వదిలేశారని అన్నారు. ఎవరి పాలనలో అవినీతి జరిగిందో ప్రజలకు తెలుసని అన్నారు. ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని పాల్గొన్నారు.


సామర్లకోటలో మాట్లాడుతున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

సామర్లకోట: సీఎం జగన్ పాలనపై ప్రజల్లో పూర్తి విశ్వాసం ఉందని వైఎస్సార్ సీపీ శ్రేణులు అన్నారు. పట్టణ, మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలసి ఇంటింటా పర్యటించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన


స్పందనలో సమస్యలు వింటున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి వారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో నిర్వహించిన స్పందనకు తొమ్మిది అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం చూపేందుకు అన్ని శాఖల అధికారులను స్పందనలో భాగస్వాములను చేస్తున్నామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద స్పందన జరుగుతుందన్నారు. వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుందన్నారు. డీఎల్‌పీఓ బాలామణి, సహకార శాఖ నుంచి మసకపల్లి రంగనాయకులు, గృహనిర్మాణ శాఖ ఈఈ రాజు, ఏడీఏ దైవకుమార్, పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్, ఎంఈఓ సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి


అవార్డులు పొందిన గ్రామాల సర్పంచులను సత్కరిస్తున్న నాయకులు

కొత్తపల్లి: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ కారే సుధ అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాస్థాయి పంచాయతీ అవార్డులకు ఎంపికైన గోర్స, రమణక్కపేట, మండలస్థాయి అవార్డులకు ఏంపికైన వాకతిప్ప, మూలపేట గ్రామాల సర్పంచులు రొంగల వీరబాబు, కాజులూరి అమ్మాజీ, పాలాని దొరబాబు, కంబాల మౌనికాలను మెమెంటోలు, శాలువాలతో సత్కరించారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఈఓపీఆర్డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పారదర్శక పాలన

- వైఎస్సార్ సీపీతో పంచాయతీల ప్రగతి
- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో పారదర్శక పాలన జరుగుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీల అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే జరుగుతుందన్నారు. నేరుగా పంచాయతీలకు నిధుల విడుదలతో పాటు సచివాలయ వ్యవస్థతో నేరుగా ప్రజలకు సేవలు అందుతున్నాయని అన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన తాటిపర్తి, చదలాడ, దివిలి, కొండపల్లి, మర్లావ, ఆర్‌బీపట్నం, జె.తిమ్మాపురం, మర్లావ, పులిమేరు, సిరివాడ పంచాయతీలకు అవార్డులను దొరబాబు అందజేశారు. ఈఓపీఆర్డీ మూర్తి, పులిమేరు పీఏసీఎస్ అధ్యక్షులు గోపు నారాయణమూర్తి, ఒబిలిశెట్టి అబ్బాయి, మండల కన్వీనర్ గోపు మురళీ పాల్గొన్నారు.

సామర్లకోట: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మాట్లాడుతూ అసిస్టెంట్ కలెక్టర్లుగా ఎంపికైన వారు సామర్లకోట మండలంలో శిక్షణ పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎంపీడీఓ డి.శ్రీలలిత మాట్లాడుతూ మండలంలో 18 పంచాయతీలు ఆయా కేటగిరీల్లో ఉత్తమ పంచాయతీలుగా గుర్తింపు పొందాయన్నారు. అనంతరం ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను దొరబాబు సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం పాల్గొన్నారు.


తాటిపర్తి సర్పంచ్‌కు ఉత్తమ పంచాయతీ అవార్డు అందజేస్తున్న దొరబాబు

అభివృద్ధి కమిటీ ఎన్నిక

పిఠాపురం: స్థానిక వెంకటాచల లయన్స్ క్లబ్ కల్యాణ మండప ప్రాంత అభివృద్ధి కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. సంఘ నూతన అధ్యక్షుడిగా కొమ్మనాపల్లి అప్పారావు, కార్యదర్శిగా కాకర ప్రసాదరావు, గౌరవాధ్యక్షుడిగా ఊటా సత్యనారాయణ, ఇతర సభ్యులుగా 13 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సమావేశం నిర్వహించి తాము నివసిస్తున్న ప్రాంతాన్ని లయన్స్ క్లబ్ ప్రాంతంగానే ఉంచాలని కోరుతూ తీర్మానం చేశారు. స్థానికంగా ఉన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాది కేఎస్ఆర్ భాస్కర్, వైఎస్సార్ సీపీ నేత బొజ్జా దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో మేలు

పెద్దాపురం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు జరుగుతుందని పెద్దాపురం తహసీల్దార్ వి.జితేంద్ర, వ్యవసాయ శాఖాధికారి సంజయ్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైస్ మిల్లర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిశాఖల సమన్వయంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రైతులకు ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. రైతు కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి మాట్లాడుతూ గత సీజన్‌లో జరిగిన లోటుపాట్లను అధిగమించి రైతులకు ఉత్తమ సేవలందించాలన్నారు. అనంతరం పలు అంశాలపై సమీక్షించారు. వ్యవసాయ సలహా మండలి సభ్యుడు యినకొండ వీరవిష్ణుచక్రం, ఆయా శాఖల సిబ్బంది, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జితేంద్ర

నేడు శంకరాచార్యుల జయంతి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శంకరాచార్యుల జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ వేడుకలు

సామర్లకోట: స్థానిక రైల్వే మజ్దూర్ యూనియన్ ఏర్పడి 99 ఏళ్లు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలోకి ప్రవేశించిన సందర్భంగా సోమవారం రాత్రి వేడుకలు జరుపుకొన్నారు. రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. బ్రాంచ్ చైర్మన్ ఎం.రవికుమార్, యూనియన్ నాయకులు ఏవీవీ సత్యనారాయణ, సీహెచ్ రాంబాబు, శ్రీధర్, శ్రీనివాసు, దేవిప్రసాద్ పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా విభాగాల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

8న మత్స్యకారుల సమస్యలపై బహిరంగ సభ

కొత్తపల్లి: తీర ప్రాంతంలోని మత్స్యకారుల సమస్యలపై వచ్చే నెల 8న ఉప్పాడలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు. మండలంలోని ఉప్పాడలో మత్స్యకారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి పాల్గొన్నారు.